క్లుప్తంగా

ఘనంగా ముగిసిన బంగారమ్మ ఉత్సవాలు

పద్మనాభం: మండలంలోని తునివలసలో మూడు రోజుల నుంచి జరుగుతున్న బంగారమ్మ ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. సోమవారం తొలేళ్ల ఉత్సవం జరిగింది. మంగళవారం అమ్మవారి ప్రతిమలను గ్రామంలో ఊరేగించారు. బుధవారం ముగింపు ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పరిసర ప్రాంత గ్రామాలైన మద్ది, కృష్ణాపురం, పద్మనాభం, రెడ్డిపల్లి, పొట్నూరు, విజయానందపురం నుంచే కాకుండా దూర ప్రాంతాలైన విజయనగరం, అనకాపల్లి నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.

రాత్రివేళ అక్రమంగా షెడ్ల కూల్చివేత

తగరపువలస: తమ వ్యవసాయ భూమిలో షెడ్లను తాటితూరు పంచాయతీకి చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ బుధవారం రాత్రి సమాచారం లేకుండా కూల్చివేసిందని బాధితురాలు రవ్వ సుభద్ర ఆరోపించారు. ఆమె మాట్లాడుతూ తాటితూరు సర్వే నంబర్ 4/1లో తమకు వారసత్వంగా వచ్చిన భూమిని సాగు చేసుకుంటూ షెడ్లు నిర్మించుకున్నామన్నారు. కొంతకాలంగా రియల్ ఎస్టేట్ సంస్థ తమ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నాలు చేస్తోందన్నారు. దీనిపై ఇప్పటికే న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. ఇందులో రాత్రి వేళ షెడ్లు కూల్చి న్యాయస్థానాన్ని ధిక్కరించారని ఆమె వాపోయారు. దీనిపై గురువారం పూర్తి వివరాలు మీడియాకు వెల్లడిస్తామన్నారు.

ప్రమాదకరంగా గ్రావెల్ రోడ్డు



ఆదర్శనగర్ రోడ్డులో సర్వీస్‌రోడ్డుపైకి వచ్చిన గ్రావెల్ తాత్కాలిక రహదారి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు ఆదర్శనగర్ కూడలి వద్ద స్థానికులు సర్వీస్‌రోడ్డు నుంచి వారి ఇంటికి వెళ్లేందుకు గ్రావెల్‌తో తాత్కాలికంగా రహదారి నిర్మించుకున్నారు. దీంతో ఇది ద్విచక్రవాహనదారుల పాలిట ప్రమాద కూడలిగా మారిపోయింది. ద్విచక్రవాహనాలపై విశాఖ వైపు వెళ్లేవారు వేగంగా వెళ్తున్నప్పుడు ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించబోయి ఈ గ్రావెల్‌పై జారి పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో సర్వీస్‌రోడ్డుపై గ్రావెల్‌ను పూర్తిగా తొలగించేలా నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని ద్విచక్రవాహనదారులు కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా సహస్రనామార్చన



అప్పన్నకు సహస్రనామార్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఉదయం సహస్రనామార్చన విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. 1001 నామాలతో స్వామికి సహస్రనామార్చన నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి తులసి ప్రసాదాన్ని అందజేశారు.

విశిష్టమైనది స్పర్శ సిద్ధాంతం



మాట్లాడుతున్న తెలుగు ఆచార్యుడు వెంకటేశ్వర యోగి

సీతంపేట: ఆధ్యాత్మిక వేత్తల స్పర్శ శిష్యుల్లోని అజ్ఞానాన్ని పోగొట్టి జ్ఞాన దీప్తిని కలిగిస్తుందని ఏయూ తెలుగు ఆచార్యుడు డాక్టర్ ఆతుకూరి వెంకటేశ్వర యోగి అన్నారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన సాహిత్య కార్యక్రమంలో ఆయన ప్రధాన ప్రసంగం చేశారు. వైద్యుల స్పర్శ రోగికి ఉపశమనం కలిగిస్తుందని, తెలుగు, సంస్కృత కావ్యాల్లో స్పర్శ విశేషమని పేర్కొన్నారు. స్పర్శ సిద్ధాంతం భారతీయ సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించుకుందని తెలిపారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, కె.జి.వేణు, డి.వి.సూర్యారావు పాల్గొన్నారు.

శ్రమయేవ జయతే..

శ్రమజీవులపాలిట కల్పతరువుగా ఉంది వెల్డింగ్ పరిశ్రమ. తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం వస్తుండటంతో ఎక్కువమంది ఆసక్తి చూపిస్తున్నారు. మధురవాడ, పీఎం పాలెం ప్రాంతాలలో సుమారు 500 మంది వరకూ వెల్డింగ్ పరిశ్రమపై ఆధారపడే కార్మికులున్నారు. షాపులలో పనులతో పాటు పోర్టబుల్ వెల్డింగ్ మెషీన్లు అందుబాటులోకి రావడంతో పనిలో ప్రావీణ్యం ఉన్న కొంతమంది కార్మికులు నేరుగా నిర్మాణంలో ఉన్న భవనాల వద్దే పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు.



ఐరన్ వెల్డింగ్ పనులలో కార్మికులు



డ్రిల్లింగ్ చేస్తున్న వెల్డింగ్ కార్మికుడు

పీఎం పాలెం: ఉపాధి కోసం ఉరుకులు పరుగులు పెడుతున్న నేటి రోజుల్లో స్వయం ఉపాధి మార్గంగా నిలిచింది వెల్డింగ్ పరిశ్రమ. నిన్న మొన్నటి వరకు వెల్డింగ్ పనులు చిన్న పరిశ్రమకే పరిమితం. ఇప్పుడు పరిస్థితి మారింది. తక్కువ వ్యయంతో పోర్టబుల్ వెల్డింగ్ మెషీన్ అందుబాటులోకి రావడంతో ప్రత్యేకంగా షాపులు అద్దెకు తీసుకునే వారి సంఖ్య క్రమంగా తగ్గిపోతుంది. ఎక్కడ కావాలంటే అక్కడికి వెల్డింగ్ వర్కర్లు వెళ్లి పని పూర్తి చేసేస్తున్నారు. తానే వర్కర్, తానే యజమాని అన్న చందంగా ఎంతోమంది దర్జాగా ఉపాధి పొందుతున్నారు. కాస్త డబ్బులు వెనుక వేసుకోగలుగుతున్నారు.



వెల్డింగ్ చేసిన స్టీల్ గేట్లు

తక్కువ పెట్టుబడితో..

వెల్డింగ్ పనిలో రాణించడానికి పెద్దగా పెట్టుబడి అవసరం లేదు. పది వేల రూపాయల లోపు వెల్డింగ్ మిషన్లు అందుబాటులో ఉన్నాయి. **డ్రిల్లింగ్ మెషీన్, గ్రైండింగ్,** వాల్ డ్రిల్లింగ్ మెషీన్.. తదితర సామగ్రి అంతా కలిపి పాతిక **వేల రూపాయలలోపు** ఖర్చుతో పెద్ద పెద్ద వెల్డింగ్ పనులు చేసుకోవచ్చు. కొత్తగా **ఈ ఉపాధిని ఎం**చుకునేవారికి పెట్టుబడి ఇబ్బంది కూడా లేకుండా ఈ పని **ముట్లు అద్దెకు** కూడా లభ్యం కావడం మరింత సౌకర్యంగా ఉంటుంది. కొద్ది **రోజులు అద్దె** సామగ్రితో పని చేసి, కాస్త కుదుటపడిన తర్వాత తమ పనులకు అనుగుణంగా సామగ్రి సమకూర్చుకుంటున్నారు.

అడుగుల లెక్కన..

ప్రసుతం అడుగుల లెక్కన అవసరమైన గ్రిల్స్ చేయించుకుంటున్నారు. కిటికీలు, గేట్లు, మెయిన్ గేట్లు, బాల్కనీ, మెట్లు రెయిలింగ్ తదితర పనులకు డిజైన్, మెటీరియల్‌ను బట్టి ధర ఉంటుంది.

స్టీల్ వెల్డింగ్‌కే మొగ్గు

- భవన నిర్మాణదారులు ఎక్కువగా స్టీల్ వైపే మొగ్గు చూపుతున్నారు. విశాఖ నగరం భౌగోళికంగా ఇనుముకు అనుకూలం కాదు. సమీపంలోనే సముద్రం ఉండటం వలన త్వరగా తుప్పు పట్టే అవకాశాలు ఎక్కువ. దీంతో ధర రెండు, మూడింతలు ఎక్కువైనా స్టీల్ పైపులు, రాడ్లతో అందమైన డిజైన్లలో లభించే స్టీల్ వెల్డింగ్‌తో తయారైన గేట్లు, కిటికీలు, బాల్కనీ గ్రిల్స్‌పైనే వినియోగదారులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు.
- ఐరన్‌తో తయారు చేసిన వెల్డింగ్ సామగ్రికి పదేపదే పెయింటింగ్ వేస్తుండాలి. ఆ పెయింటింగ్ పోయిన ప్రాంతాల్లో నీళ్లు పడినా, తడిసిపోయినా తుప్పు పట్టి చిల్లులు పడుతుంది. అదే స్టీల్‌తో తయారు చేసిన వాటికైతే పెయింటింగ్ అవసరం ఉండదు. ఎన్నాళ్లయినా పాడవ్వవు. ఇంటికి కొత్త అందాన్ని, రిచ్ లుక్‌ను ఇస్తాయి.

రేట్లు పెరిగినా..



గతంలో కంటే ఇనుము రేట్లు పెరిగాయి. వెల్డింగ్ రాడ్ల ధరలు కూడా బాగా పెరిగాయి. కష్టపడి పని చేసుకున్న వారికి ఫర్వాలేదు. లేబర్ రోజుకు రూ.వెయ్యి వరకు తీసుకుంటున్నారు. అంత మొత్తం చెల్లించడం కష్టమే అయినా తప్పదు. మొత్తం మీద పదిమందికి ఉపాధి దొరుకుతుంది.

– బవదారు ఈశ్వరరావు, పీఎం పాలెం



బాల్కనీ గ్రిల్స్‌కు పెయింటింగ్ వేస్తున్న యువతి

పదేళ్లుగా ఈ వృత్తిలోనే..



నేను బీకాం చదువుకున్నాను, ఉద్యోగావకాశాలు సన్నగిల్లడంతో ఉపాధిగా వెల్డింగ్ పనిని ఎంచుకున్నాను. 10 సంవత్సరాల అనుభవం ఉంది. రోజుకు ఖర్చులు పోను వెయ్యి రూపాయలు సంపాదిస్తున్నాను. శ్రమను నమ్ముకుంటే అవకాశాలకు కొదువ ఉండదని అర్థమైంది. జీవితం హాయిగా సాగిపోతుంది.

– కె.రాము, మధురవాడ

కష్టానికి తగ్గ ప్రతిఫలం



మిగతా కూలిపనుల కంటే వెల్డింగ్ వర్కర్లకు కష్టానికి తగ్గ ఫలం లభిస్తోంది. పనిలో నైపుణ్యం ఉంటే ఎక్కడైనా రాణించవచ్చు.

– కె.హరి, మధురవాడ

రాజస్థాన్ నుంచి వచ్చి స్థిరపడ్డాం



మేం రాజస్థాన్ నుంచి వచ్చాం. కుటుంబం అంతా పని చేస్తుంటాం. మెటీరియల్ కూడా మా వద్దే ఉంటుంది. స్టీల్‌తో పని చాలా ఓర్పుతో చేయాలి. కచ్చితమైన కొలతలతో చేయాలి. కానీ, స్టీల్‌తో తయారు చేయించుకున్న గేట్లు , కిటికీలు, బాల్కనీ గ్రిల్స్ బాల్కనీ రెయిలింగ్, మెట్లు రెయిలింగ్ ఎప్పటికీ చెక్కు చెదరవు. రేటు ఎక్కువైనా ఇదే బెస్ట్. మాకు ఉపాధి బాగుంది.

– విక్రమ కుమార్, మధురవాడ (రాజస్థాన్)

రూ.1.39 కోట్లకు వేములవలస డైలీ మార్కెట్ వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస మహాత్మాగాంధీ డైలీ మార్కెట్‌కు 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను బుధవారం వేలంపాట నిర్వహించగా రూ.1.39 కోట్లకు పతివాడ పుష్పలత అలియాస్ ట్రిపుల్ ఆర్ అనే మహిళ సొంతం చేసుకున్నారు. జిల్లా పంచాయతీ అధికారి పి.శ్రీనివాసరావు సమక్షంలో జరిగిన ఈ వేలం ప్రక్రియలో ముగ్గురు పాల్గొన్నారు. వీరిలో పతివాడ అప్పలనాయుడు రూ.1.37 కోట్లకు, లండ అప్పలనాయుడు రూ.1.30 కోట్లకు సీల్డ్‌కవర్లు వేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు పాటదారు డైలీ మార్కెట్‌లో ఆశీలు వసూలు చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 2024 జూలై నుంచి 2025 మార్చి వరకు తొమ్మిది నెలల కాలానికి గాను వెన్ని శంకరరావు అనే వ్యక్తి రూ.1.27 కోట్లకు వేలంలో మార్కెట్‌ను దక్కించుకున్న సంగతి తెలిసిందే. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం తక్కువ మొత్తానికి మార్కెట్ వేలం సాగింది. కార్యక్రమంలో సర్పంచ్ లంకలపల్లి కొండమ్మ, ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లానింగ్ సెక్రటరీకి చార్జ్ మెమో

కోర్టు ఆర్డర్ అమలు పరచకపోవడంపై ఏసీపీ ఆగ్రహం



ప్లానింగ్ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఏసీపీ

మధురవాడ: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జీవీఎంసీ జోన్–2 టౌన్ ప్లానింగ్ ఏసీపీ తిరుపతిరావు సిబ్బందిని హెచ్చరించారు. జీవీఎంసీ 13వ వార్డు 12వ సచివాలయ పరిధిలో రోడ్డును ఆక్రమించి, సరైన ప్లాన్ కూడా లేకుండా చేపడుతున్న ఓ నిర్మాణంపై చర్యలు చేపట్టాలని ఒక వ్యక్తి జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీకి కొన్ని నెలల క్రితం ఫిర్యాదు ఇచ్చాడు. నెలలు గడుస్తున్నా ఎవరూ స్పందించకపోవడంతో, సదరు ఫిర్యాదుదారుడు కోర్టును ఆశ్రయించారు. అయినప్పటికీ కోర్టు ఆర్డర్‌ను అమలు చేయకపోవడంతో.. జీవీఎంసీ అధికారులు కోర్టు ధిక్కారానికి పాల్పడుతున్నట్లు సదరు ఫిర్యాదు దారుడు మళ్లీ ఫిర్యాదు చేసేందుకు సిద్ధం అయ్యారు. దీంతో ఏసీపీ ఇరువర్గాలను బుధవారం జోనల్ ఆఫీసుకు పిలిపించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంతో పాటు కోర్టు ఆర్డర్ అమలు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్లానింగ్ సెక్రటరీ ఉదయ్‌కుమార్‌కు చార్జ్ మెమో జారీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీనిపై ఫిర్యాదుదారుడు మాట్లాడుతూ నిబంధనల అతిక్రమణలపై చర్యలు చేపట్టకపోవడంతో పాటు అప్పటి టీపీవో వరప్రసాద్ సదరు అక్రమ నిర్మాణదారులకు మేలు చేసే విధంగా వ్యవహరించడంతో విధిలేని పరిస్థితుల్లో కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో టీపీవో వరప్రసాద్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్సు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి మొగదారమ్మ ఆలయం వెనుక అందినంత ఎత్తులో విద్యుత్ ఫ్యూజ్ బాక్సు తెరచి ఉంది. అండర్ గ్రౌండ్ విద్యుత్ సరఫరాకు సంబంధించి హై ఓల్టేజ్‌తో ఇక్కడ విద్యుత్ సరఫరా అవుతోంది. అయితే అధికారుల నిర్లక్ష్య ధోరణితో ఈ బాక్సు తెరచి ఉంచేశారు. ప్రమాదాన్ని ఊహించని చిన్నారులు, మూగజీవులు ఈ బాక్సు వద్దకు వెళ్తే ప్రాణాలకే ముప్పు పొంచి ఉంటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇలాంటి వాటికి రక్షణ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పాడైన ఆహార పదార్థాలు పంపిణీ చేస్తే చర్యలు



లబ్ధిదారులను వివరాలు అడుగుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పాడైపోయిన ఆహార పదార్థాలు పంపిణీ చేసే అంగన్‌వాడీ కార్యకర్తలపై చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ భీమిలి ప్రాజెక్ట్ పట్టణ సూపర్‌వైజర్ ప్రమీల హెచ్చరించారు. 'అంగన్‌వాడీల ద్వారా కుళ్లిన కోడిగుడ్లు' శీర్షికన సాక్షిలో బుధవారం ప్రచురితమైన వార్తపై ఆమె స్పందించారు. లబ్ధిదారులతో అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశమైన ఆమె, వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పాడైన ఆహార పదార్థాలను లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా ప్రాజెక్టుకు తిప్పి పంపాలని ఆమె అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు నేటి నుంచి శిక్షణ

పద్మనాభం: పద్మనాభంలోని వెలుగు కార్యాలయంలో ఈ నెల 20వ తేదీ నుంచి 22 వరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు 'పోషించు.. చదివించు' (పోషణ్ భీ.. పఢాయి భీ) అంశంపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు సూపర్‌వైజర్ జానకి ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ శిక్షణకు హాజరు కావాలని ఆమె కోరారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు రీఓరియెంటేషన్ ట్రైనింగ్

సీతంపేట: జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు రేసపువానిపాలెంలోని రీజనల్ ట్రైనింగ్ సెంటర్(ఫిమేల్)లో రెండు రోజుల రీఓరియెంటేషన్ ట్రైనింగ్ బుధవారం ప్రారంభమైంది. జోనల్ మలేరియా అధికారి ఎం.శాంతిప్రభ, రీజనల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ బి.సుజాత, ఏఎంవో చిత్రాడ సత్యనారాయణ, విశ్రాంత ఎంపీహెచ్‌ఈవో కె.పాపారావు శిక్షణ ఇచ్చారు. మలేరియా స్లైడ్ మైక్రోస్కోప్‌లో ఎలా పరీక్షించాలి, పారసైట్ స్టేజెస్ గుర్తింపు, స్లైడ్ టెక్నిక్, బ్లడ్ కాంపోనెంట్స్, మలేరియా జీవిత చక్రం, దోమ జీవిత చక్రం, మైక్రోస్కోప్ కాంపోనెంట్స్, తదితర అంశాలపై పవర్ పాయింట్, ప్రాక్టికల్‌గా మైక్రోస్కోప్‌లో చూపించి అవగాహన కల్పించారు. శిక్షణకు జిల్లాలోని వివిధ యూపీహెచ్‌సీల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు హాజరయ్యారు.

ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి

జెడ్సీ కనక మహాలక్ష్మి



మారికవలసలో వీఎల్‌టీ బకాయి పడ్డ స్థలాన్ని జప్తు చేస్తున్న జెడ్సీ కనక మహాలక్ష్మి తదితరులు

మధురవాడ: ఆస్తి పన్ను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని జీవీఎంసీ జోన్–2 జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి కోరారు. జోన్‌లోని సాగర్‌నగర్, ఎండాడ, మారికవలస, మధురవాడ పరిసర ప్రాంతాలలో ఆస్తి పన్ను వసూలు ప్రక్రియలో బుధవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్తి పన్ను కట్టకపోతే కుళాయి కనెక్షన్ వంటివి కట్ చేయడంతో పాటు, ఆస్తులు కూడా జప్తు చేయాల్సి వస్తుందని, ఎవరూ అంతవరకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. కేవీఆర్ డెవలపర్స్ నుంచి రూ. 36,900, నిర్మాణంలో ఉన్న బూరుగుపల్లి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నుంచి వీఎల్‌టీ రూ.13,10,940 వసూలు చేశారు. మారికవలస వద్ద వీఎల్‌టీ రూ. 3,38,31,600 బకాయిపడ్డ ఎల్ అండ్ టీ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన స్థలాన్ని జప్తు చేసినట్టు జోనల్ కమిషనర్ చెప్పారు. ఆస్తి పన్ను బకాయి పడ్డ కొన్నింటికి కుళాయి కనెక్షన్లు కట్ చేశారు. కార్యక్రమంలో ఆర్‌వో రామనారాయణ, ఆర్ఐ సయ్యద్ సుభాన్, అడ్మిన్ సెక్రటరీలు ఈశ్వరరావు, నారాయణమూర్తి, శ్రీధర్, శివప్రసాద్, జగదీష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే.. రాకపోకలెలా?

- రహదారిపైనే ఎండబెడుతున్న రాగి చేను
- ప్రయాణికుల అవస్థలు



తునిపాలెంలో రోడ్డుపై ఉన్న రాగులు



మద్దిలో రోడ్డుపై వేసిన కోసిన రాగి చేను

పద్మనాభం: మండలంలోని పలు రహదారులపై కోసిన రాగి (చోడి) పంట చేనును ఎండ పెడుతున్నారు. దీంతో ఈ రోడ్లపై రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని మద్ది, తునిపాలెం, విలాస్కాన్‌పాలెం గ్రామాల్లోకి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్లపై ఈ పరిస్థితి ఉంది. దీంతో ఈ రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనచోదకులు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా జారిపడే ప్రమాదం ఉంది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి, కోసిన చేను రోడ్లపై ఎండబెట్టకుండా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

పెద్ద చెరువు నుంచి మళ్లీ దుర్వాసన




దుర్వాసన వెదజల్లుతున్న చిట్టివలస పెద్ద చెరువు

తగరపువలస: చిట్టివలస పెద్ద చెరువు వారం రోజులుగా దుర్గంధం వెదజల్లుతోంది. భీమిలి రోడ్డులో ఒక పక్క నీటిపై తెట్టులా తేలుతున్న వ్యర్థాలే అ దుర్వాసనకు కారణమని చెరువు చుట్టూ నివాసం ఉంటున్న వారు ఆరోపిస్తున్నారు. దీని నుంచి వస్తున్న దుర్వాసన సమీపంలో ఉన్న గ్రామాలు జీరుపేట, చిల్లపేటలను తాకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా వేసవిలో ఈ చెరువు నుంచి వస్తున్న దుర్వాసన కారణంగా పలువురు అస్వస్థతకు గురవుతున్నారు. గతంలో దుర్వాసన కారణంగా చిట్టివలస పెరికివీధి వాసులు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ఈ దుర్వాసన భీమిలి రోడ్డువైపు మళ్లడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సంగివలస మెడికల్ ఆస్పత్రి నుంచి వ్యర్థాలు ఈ చెరువులో కలవడమే దుర్వాసనకు కారణమని ఇటీవల జీరుపేట, చిల్లపేట గ్రామాల ప్రజలు ఆరోపించారు. చెరువు సామర్థ్యానికి తగినట్టుగా అవుట్‌లెట్లు లేనందున వేసవిలో నీరు అడుగంటిన సమయంలో పూడిక నుంచి ఈ దుర్వాసన వస్తున్నట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. చెరువు దుర్వాసన అరికట్టేలా శాశ్వత పరిష్కారంగా జీవీఎంసీ, ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టాలని, చెరువు చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కొమ్మల మాటున విద్యుత్ వెలుగులు



వీధి దీపాల వెలుగులు చెట్ల మాటున, తీగల మధ్య చిక్కుకుపోతున్నాయి. దీంతో భీమిలి జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌దీపాలు ఉన్నా నిరుపయోగమవుతుంది. కొన్నిచోట్ల ఈ వెలుగులు క్రీనీడగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. చెట్ల కొమ్మలు, లతలు తొలగించి వెలుగులు ప్రసరించేలా చూడవలసిన జీవీఎంసీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. మరికొన్ని చోట్ల విద్యుత్ స్తంభాల ముందు కొత్తగా దుకాణాలు పెట్టి వెలుగులు ప్రసరించకుండా అడ్డు తగులుతున్నారు. వీటిపై స్పందించాలని జీవీఎంసీ భీమిలి పట్టణ ప్రజలు కోరుతున్నారు. – తగరపువలస



